క్లుప్తంగా

కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధవళేశ్వరం: హెల్పేజ్ ఇండియా సహకారంతో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ధవళేశ్వరం ఎస్ఎంఈఏ లూథరన్ చర్చి పక్కనే గల విజన్ సెంటర్‌లో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 140 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 40 మంది వృద్ధులకు శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్య సిబ్బంది డాక్టర్ సీహెచ్ నాగరాజు, సీహెచ్ శ్రావణి, సీహెచ్ శ్రీనివాస్, టి.సూర్యప్రకాష్, మోహన్ సేవలందించారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కడియం: బుర్రిలంకలోని పీఎస్ఎం కన్వెన్షన్ హాల్లో గురువారం మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జేగురుపాడు, పొట్టిలంక, వీరవరం, దుళ్ల, మురమండ, కడియపుసావరం, మాధవరాయుడుపాలెం, దామిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన వారితో సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కడియం, కడియపులంక, వేమగిరి గ్రామాల చెందిన వారితో నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రకాశం నగర్: 33/11 కేవీ ధవళేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బీఎస్ఆర్ ఫీడర్ న్యూ పేరవరం లైన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శామ్యూల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇండస్ట్రియల్ కాలనీ, ఎర్రకొండ, ఇనోసాల్ట్, రత్న ట్యూబ్స్, మంతెన ఆశ్రమం, బీఎస్ఆర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

యూనియన్ బ్యాంక్ వితరణ



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు ప్రతినిధులు

కడియం: స్థానిక హైస్కూల్ గ్రంథాలయానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 27 వేలు విలువైన కుర్చీలను బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీజినల్ జీడీఎం పి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందిస్తున్నారన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ కడియం శాఖ మేనేజర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డీఎం జి.రవి కుమార్, ఉపాధ్యాయులు కె.రాజు, డేవిడ్, శరత్‌బాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



జేగురుపాడులో సాయం అందజేస్తున్న గిరజాల బాబు, స్టాలిన్

కడియం: మండల పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో నష్టపోయిన బాధితులకు బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) బుధవారం సాయం అందజేశారు. వంట పాత్రలు, బియ్యం, నిత్యావసరాలు, దుస్తులను వితరణ చేశారు. జేగురుపాడు పంచాయతీ పరిధి పాములమెట్ట కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ గిరజాల బాబు సేవలను అభినందించారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీలో బాధితులకు కూడా సహాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, దామిరెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ రంపం గోపాలకృష్ణ, నాయకులు కుసుసూరి బాబులు, ముద్రగడ మహేష్, ఆరేటి వెంకట్రావు, బళ్ల అన్నవరం, సర్కార్ బాషా, మోటిక మునియ్య, సాకా కిరణ్, సేవా సంస్థ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు, కొత్తపల్లి బాలాజీ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం

ప్రకాశం నగర్: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు బుధవారం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా పదాధికారులకు సంబంధించి ఏడుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు కార్యదర్శులు, ఒక కోశాధికారితో కూడిన కమిటీని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

ఆధునిక సాగు.. ప్రోత్సాహం బాగు

- రైతులకు యంత్ర సాయం
- సబ్సిడీపై వివిధ పరికరాలు
- వ్యవసాయానికి అండగా జగన్ ప్రభుత్వం



డ్రోన్ పనితీరుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది (ఫైల్)

కడియం: రైతులకు అన్ని విధాలా సాయం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటోంది. పెట్టుబడి సాయం, రైతు భరోసా, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం తదితర తోడ్పాటు అందిస్తూనే సాగులో ఆధునిక పద్ధతులను తీసుకువస్తోంది. అందులో భాగంగా రైతులను సంఘటితం చేసి తమకు అవసరమైన పరికరాలను వారే ఎంచుకునే విధంగా చైతన్య పరుస్తోంది. ఎంపిక చేసుకున్న పరికరాలకు సబ్సిడీని అందించి సాగులో ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలం పరిధిలో ఇప్పటి వరకు రెండు ట్రాక్టర్లు, రెండు రొటోవేటర్లు, 31 పవర్ టిల్లర్లు, 4 కంబైన్డ్ హార్వెస్టర్లు, ఒక గడ్డిమోపులు కట్టే యంత్రాలను రైతులకు అందజేసింది.

పూర్తిస్థాయి అవగాహనతోనే..

గత ప్రభుత్వాల హయాంలో ఏవో ఒక పరికరాలు తెచ్చి, సబ్సిడీపై తీసుకోవాల్సిందిగా ఆదేశించేవారు. అయితే వాటిలో రైతులకు ఉపయోగపడనివే ఎక్కువగా ఉండేవి. దీంతో రైతులు వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపేవారు కాదు. అయితే ఇప్పుడు రైతులకు ఏ పరికరాలు అవసరమో వాటినే సబ్సిడీపై అందజేసేందుకు నిర్ణయించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి, వాటి పరిధిలో సాగు చేసే రైతుల అవసరాలకు ఏ పరికరాలు అవసరమో వాటినే అందజేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆధునిక యంత్రాలను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు ఉపయోగపడే డ్రోన్లను సబ్సిడీపై కడియం మండలంలో రెండు గ్రూపులకు అందజేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరో రెండు ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లను కూడా రైతులకు అందుబాటులో ఉంచారు. ఇటీవలే రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు కూడా అభిప్రాయపడ్డారు. సమయం, పురుగు మందు పరిమాణం కూడా ఆదా అవుతుందన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రైతులకు అవసరమైన యంత్రపరికరాలు పొందేందుకు ముందుగా ఐదుగురు సభ్యులు గ్రూపుగా ఏర్పడాలి. ప్రతి ఆర్బీకే పరిధిలోని ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆసక్తి కల రైతులు వ్యవసాయ/ ఉద్యానశాఖ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు పూర్తి చేసుకోవచ్చు. రైతులకు డ్రోన్లు ఇచ్చి ఊరుకోకుండా, దాని వినియోగానికి సంబంధించిన శిక్షణను కూడా ప్రభుత్వ అందజేస్తోంది. ఇప్పటికే పది గ్రూపుల ద్వారా వివిధ రకాల పరికరాలను అందజేయడం జరిగింది.

- కె.ద్వారకాదేవి, వ్యవసాయాధికారి, కడియం

విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ మాధవీలత
- భవిత ఉప కేంద్రం తనిఖీ



భవిత ఉపకేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఆ దిశగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. తాడితోట మున్సిపల్ ఎంపీ స్కూల్లోని భవిత ఉప కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ పిల్లల మానసిక పరిపక్వత, శారీరక దారుఢ్యం పెంపు దిశగా చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికలపై మాట్లాడారు. విద్యార్థులకు అందజేస్తున్న ఫిజియోథెరపీ వివరాలను డాక్టర్ మధుశ్రీ వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం వచ్చిన సందర్భంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు దివ్యాంగుల పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరినట్టు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో పెన్షన్ సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా ఎవరైనా పిల్లలకు పెన్షన్ సౌకర్యం లేకపోతే వారి వివరాలు అందజేయాలని ఆదేశించారు. సదరం శాశ్వత సర్టిఫికెట్లు లేని దివ్యాంగులకు పెన్షన్లు ఆగిపోయాయని ఐఈఆర్ టీచర్ వరలక్ష్మి తెలపడంతో.. వెంటనే వారికి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో, డీఆర్‌డీఏపీడీ, డీఈవోకు కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం కింద పౌష్టికాహారం నిబద్ధతతో అందజేయాలన్నారు. జిల్లాలోని 19 భవిత ఉపకేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

ఎస్వీఆర్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వారంలో ఏరోజు ఏరంగు స్టాంపు వేసిన కోడిగుడ్లు వస్తున్నాయో తెలిపే సమాచారాన్ని బోర్డులో ప్రదర్శించకపోవడంపై ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణలో ప్రతి అంశంపై ప్రధానోపాధ్యాయుడు పూర్తి నిబద్ధతతో ఉండాలన్నారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, ఎస్వీఆర్ స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ స్నేహలత, నాన్ భవిత సెంటర్ ఐఆర్‌టీ టీచర్ వరలక్ష్మి, సీఆర్పీ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు యోగాపై అవగాహన



డైట్‌లో జిల్లాక్రీడాభివృద్ధిసంస్థ అధికారి శేషగిరికి సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులకు బుధవారం జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ(డీఎస్‌డీఏ) ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ మన డైట్ ప్రాంగణానికి దగ్గరలో ఏర్పాటు చేసిన డీఎస్‌డీఏ సేవలను ఛాత్రోపాధ్యాయులు వినియోగించుకుని వివిధ అంశాలలో సుశిక్షితులు కావాలని కోరారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి శేషగిరి మాట్లాడుతూ ఆటలు, యోగా వంటి అంశాలలో అవగాహన సదస్సులే కాకుండా ఎంచుకున్న అంశాలలో డీఎస్‌డీఏ కోచ్‌ల సహాయంతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా కోచ్ నాగేంద్ర కొన్ని ఆసనాలు, ప్రాణాయామం గురించి వివరించారు. కార్యక్రమానికి డైట్ పీడీ వీరభద్రరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం శేషగిరి, నాగేంద్రలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యనారాయణ సత్కరించారు.

73 కిలోల గంజాయి స్వాధీనం

ధవళేశ్వరం: ఏజెన్సీ నుంచి తీసుకువచ్చి కారులో ఉంచిన 73 కిలోల గంజాయిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి తెలిపారు. ధవళేశ్వరం రెవెన్యూ కాలనీ వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో ఎస్సై వి.క్రాంతి కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో కారులోని 73 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాన్ని తరలిస్తున్న వరుపుల లక్ష్మి, బియ్యాల చిన్న అప్పలనాయుడును అరెస్టు చేశారు. గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు.

యువతి అదృశ్యం

ధవళేశ్వరం: రాజవోలు గ్రామానికి చెందిన అనంతారపు షమీల ఈనెల 20వ తేదీ రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె తండ్రి లక్ష్మణరావు బుధవారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండగుంటూరుపాకల గ్రామానికి చెందిన పోతుల భరణీ సీతారామ్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సై క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25న జాబ్‌మేళా

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెలకు రూ.10 వేల వరకు వేతనం, ఇంటెన్సివ్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు ఆరోజు ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 94940 89595 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్వయం సంరక్షణపై అవగాహన

రాజానగరం: రాధేయపాలెంలోని హెల్త్ క్లినిక్‌లో కుష్ఠు, బోద వ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణ పద్ధతులపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బ్రైట్ ఫ్యూచర్ సంస్థ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రోజెక్టు, పాలచర్ల పీహెచ్‌సీలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. డాక్టర్ బెనెరెడ్డి, రీచ్ మీ ప్రోజెక్టు జిల్లా కో ఆర్డినేటర్ ఎం.రంగనాథరావు స్వయం సంరక్షణ పద్ధతుల గురించి వివరించి, అందుకు అవసరమైన కిట్లను అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్ రమణ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మధురపూడి: ఉద్యానవనాల పెంపకంలో యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చని పెద్దాపురానికి పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ప్రకాశ్ అన్నారు. మధురపూడిలో బుధవారం పామాయిల్ తోటల రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ మొక్కల పెంపకంలో డిప్ ఇరిగేషన్ పద్ధతులు అవలంబించడం ద్వారా తోటల విస్తృతికి దోహదపడుతుందన్నారు. తెగుళ్ల నిర్మూలన, సస్యరక్షణ ద్వారా పామాయిల్ గెలల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి రినీ మాట్లాడుతూ పామాయిల్ తోటలో అంతర్ పంటల సాగు చేసుకోవచ్చన్నారు. దీనిద్వారా రెండు విధాలుగా ఆదాయం పొందడానికి అవకాశం ఉందన్నారు.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం చంద్రబాబుదే

- పట్టాభిపై థర్డ్ డిగ్రీ జరగలేదని కోర్టు చెప్పింది
- ఎంపీ భరత్ రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: పట్టాభిపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించారని, ఇదంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయించిందన్న టీడీపీ శ్రేణులు వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఖండించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆధారాలుంటే న్యాయస్థానంలో పొందుపరచవచ్చు కదా టీడీపీ నాయకులను ప్రశ్నించారు. పట్టాభి ఘటనకు కథ, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం చంద్రబాబేనని ఆరోపించారు. పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని మెడికల్ రిపోర్టులు పరిశీలించాక గన్నవరం కోర్టు ధ్రువీకరించిందని.. ఇంకా ఎందుకు ఈ ప్రశ్నలన్నారు. అనపర్తి సభలో పోలీసులను సంఘ విద్రోహక శక్తులని అనడం న్యాయమేనా అని ప్రశ్నించారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేశానని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు పోలీసు వ్యవస్థను కించపరుస్తూ మాట్లాడి..సమాజానికి ఎటువంటి సంకేతాలు పంపిస్తున్నారన్నారు. తెలంగాణలో నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్‌లో డ్రామాలు ఆడితే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. లోకేష్ గత నాలుగేళ్లుగా పడుకుని.. ఇప్పుడు యువగళం నా గళం అంటూ పర్యటిస్తే నమ్మేవారు ఎవరూ లేరన్నారు. ఈ తండ్రి, తనయుడు, దత్తపుత్రుడు చర్యలను ఎల్లో మీడియా ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు.

జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం

క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత జేసీఎస్ కన్వీనర్ల పైనే ఉందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షత వహించగా, ఎంపీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావాలన్నారు. వార్డు ఇన్‌చార్జులు, కోఆర్డినేటర్లను సమన్వయం చేసుకుంటూ జేసీఎస్‌లు పార్టీ కార్యక్రమాలతో పాటు నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఇంకా కొన్ని వార్డులలో గృహసారథులను త్వరితగతిన నియమించాలన్నారు. సమావేశంలో జేసీఎస్‌లు ఎస్వీ శ్రీనివాస్, మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు, పోలు విజయలక్ష్మి, కొత్తా విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

డెంగీ, టైఫాయిడ్‌పై అవగాహన



డాక్టర్ కళాధర్‌రెడ్డిని సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: కమ్యూనిటీ పారామెడిక్స్ - ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో మండల అధ్యక్షులు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఫస్ట్ ప్లస్ ఎమర్జెన్సీ - క్రిటికల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బీఆర్ కళాధర్ రెడ్డి మాట్లాడుతూ డెంగీ, టైఫాయిడ్ జ్వరాలకు ప్రాథమిక వైద్యం ఎలా అందించాలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి కేఎస్ ప్రసాద్, జిల్లా గౌరవ సలహాదారు పి.దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

న్యాయసేవలపై విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: ప్రీ అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశలలో ముద్దాయిలకు లభించే న్యాయ సేవలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం పొందడం నిందితుల హక్కు అని, క్రిమినల్ కేసుల ప్రక్రియ అంతా కేసు ఏ దశలో ఉన్నా ముద్దాయిలు న్యాయ సేవలను పొందవచ్చన్నారు. కేసు నమోదు చేసే విషయంలో పోలీసు వారు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. అలాగే జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015ను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జె.మహేష్ తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.శ్రీలత, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం



పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న అన్నదానం

ప్రకాశం నగర్: పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని లయన్స్ మాజీ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం, స్వర్ణాంధ్ర సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పుష్కర ఘాట్ నిర్వహిస్తున్న అన్నదానం బుధవారంతో 500వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి గ్రంధి వెంకటేశ్వరరావు, వీబీ రాయుడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, రోజుకు సుమారు 500 మందికి అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. దీనికి నగరంలోని దాతలు, లయన్స్ సభ్యులు సహకరించాలని కోరారు. నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ నగరంలోని నిరాశ్రయులు, వృద్ధులు, అనాథల కోసం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 1,64,540 మందికి అన్నదానం చేశామని, సుమారు 5 వేల మంది వలంటీర్లు సేవలందించారన్నారు. హైకోర్టు న్యాయవాది రంగరాజన్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ మాజీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కొల్లూరి గోపాలకృష్ణ, హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి అనూప్ జైన్ పాల్గొన్నారు.

ప్రకృతి విధానాలతో నేలను కాపాడుకోవాలి



కడియంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, రైతులు, సిబ్బంది

కడియం: ప్రకృతి సాగు విధానాలతో నేల తల్లిని కాపాడుకోవాలని పలువురు కోరారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కడియంలో ప్రకృతి సాగు విధానాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ అనంతరం, దేవీచౌక్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. సాగులో 30 రకాల విత్తనాలను వినియోగించడం ద్వారా నేలను సారవంతం చేసుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. నేల తన స్వాభావిక గుణాన్ని కోల్పోతే భవిష్యత్తులో పంటలు పండవని తెలిపారు.

నర్సరీలు విజ్ఞాన కేంద్రాలు



సత్యదేవ నర్సరీలో ఒడిశా రైతులు

కడియం: నర్సరీలు విజ్ఞాన కేంద్రాలు అని ఒడిశాకు చెందిన పలువురు రైతులు, ఉద్యానశాఖ అధికారులు కొనియాడారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఒడిశాలోని గంజాం నుంచి అసిస్టెంట్ హార్టికల్చర్ ఆఫీసర్ ప్రశాంత కుమార్ బెహర, అశోక్ కుమార్ పైకిరేలతో కూడిన రైతుల బృందం కడియపులంకలోని పుల్లా ఆంజనేయులకు చెందిన సత్యదేవ నర్సరీకి విచ్చేసింది. ఈ సందర్భంగా స్థానికంగా లభించే మొక్కలు, నర్సరీల నిర్వహణ తదితర అంశాలను ఆంజనేయులు తదితరులు వివరించారు. వారి వెంట కడియం హెచ్‌వో సుధీర్ కుమార్, వీహెచ్ఏ కామేశ్వరరావు ఉన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ పరిధిలో టెక్నికల్ టీమ్, ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ సిబ్బందితో కలిసి సోమాలమ్మ సెంటర్‌లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి పరలోకం అనే వ్యక్తిని అరెస్టు చేసి, 180 ఎంఎల్ 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.